## క్లుప్తంగా

### ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోండి



చక్రవర్తులపల్లె గ్రామం వద్ద తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ

చాగలమర్రి: వర్షానికి మొక్కజొన్న పంట దెబ్బ తిన్న రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వివరాలు నమోదు చేసుకోవాలని ఏఓ రంగ నేతాజి సూచించారు. శుక్రవారం ఆయన చక్రవర్తులపల్లె, ముత్యాలపాడు, ఎం. తండా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. .

### పోరాటాల ఫలితమే ఎస్సీ రిజర్వేషన్



ఓబన్న కుటుంబ సభ్యులతో మందకృష్ణ

ఆళ్లగడ్డ: ఎందరో పోరాటాల ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓబన్న 1992 నుంచి ఎస్సీ రిజర్వేషన్ సాధన కోసం కృషి చేసి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మందకృష్ణ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. భార్య బాలమ్మతో పాటు ఆయన కుమారులు వీఆర్‌ఓ సాంబశివుడు, చిన్న ఓబులేసు, బాల ఓబులేసు, పెద్ద ఓబులేసులతో మాట్లాడి అండగా ఉంటానన్నారు.

### సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

శిరివెళ్ల: మండల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు జరుగుతుందని తహసీల్దార్ పుష్పకుమారి శుక్రవారం తెలిపారు. కేసీ కెనాల్ పరిధిలో 5 సాగు నీటి సంఘాలు ఉన్నాయని వాటిలో 56 టీసీలు, తెలుగు గంగ కింద ఉన్న 7 సంఘాల్లో 56 టీసీలున్నాయన్నారు. అలాగే గంగవరం, బోయలకుంట్ల, ఇసుకపల్లె, చెన్నూరు, శిరివెళ్ల చెరువు పరిధిలోని సంఘాల్లో ఒకొక్క చెరువు కింద గల 24 టీసీలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. టీసీ పరిధిలోని ఓటు హక్కు గల రైతుల జాబితాలను ఆయా శాఖల అధికారులు తయారు చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఎన్నికలకు ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉండగా వాయిదా పడిందన్నారు. నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు.

### ఆక్రమణకు గురైన వంక స్థలాన్ని స్వాధీనం చేసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లె గ్రామంలో ఉర వంకకు సంబంధించి ఆక్రమణకు గురైన 2.54 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక తహసీల్దారు రవి కుమార్‌ను శుక్రవారం ఆ గ్రామ రైతులు కలిసి కోరారు. ఇందుకు ఆయన గ్రామాన్ని సందర్శించి పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో వారు ఆగ్రహించారు. తమకు పంటపొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు బాలీశ్వరరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, కుమ్మరిపల్లె దస్తగిరి, రేనాటి సదాశివారెడ్డి, శివసత్యంరెడ్డి, ఈశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ



కర్నూలు (సిటీ) : జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా బి.బాలచందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా రెడ్డి శేఖర్‌రెడ్డి పనిచేసేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బి.బాలచందర్‌రెడ్డికి ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో పలువురు ఇంజినీర్లు కలసి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

**సబ్ డివిజన్ డీఈఈగా నాగరాజు...**

చిన్ననీటిపారుదల శాఖ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా నాగరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ ఎస్ఈ బాలచందర్‌రెడ్డిని కలిశారు.



దొర్నిపాడు..తుపాను ప్రభావంతో పత్తిలో నిలిచిన క్రాసింగ్ పనులు



క్రిష్టిపాడులో గాడి దొంగ వంతెనపై ప్రవహిస్తున్న వాననీరు



రాజోలి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

# ●రైతు కష్టం
# వర్షార్పణం



నేలరాలుతున్న పత్తికాయలను చూపుతున్న రైతన్న



ఉయ్యాలవాడ.. నదిలో వరద ప్రవాహం

దొర్నిపాడు/ఉయ్యాలవాడ : బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా పడుతున్న వానలతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండటంతో కుందూనది రూపనగుడి, ఉయ్యాలవాడ గ్రామాల మధ్య ఉధృతంగా పారుతోంది. ఇప్పటికే నది తీరం వెంట ఉన్న 14 గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. మరో వైపు తుపాను దెబ్బకు పంట పొలాలు నీటమునిగాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, మిరప, సీడుపత్తి, మినుము, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



చాకరాజువేముల సమీపంలో జలమయమైన మొక్కజొన్న పంట

● దొర్నిపాడు మండలంలో గత వారం రోజులుగా భారీవర్షాల కారణంగా రైతన్నకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎక్కడ చూసినా పొలాల్లో నీటిమడులు ఉండటంతో పంట చేతికి వస్తుందో రాదోనని దిగాలు ఉన్నాడు. రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. విత్తనపత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వర్ష ప్రభావంతో గత వారం రోజుల నుంచి క్రాసింగ్ పనులు నిలిచిపోయాయి. కాయలన్నీ నేలరాతులున్నాయి.

**ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ**

చాగలమర్రి: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 12,101 క్యూసెక్కుల నీరు నదిలో ప్రవహిస్తున్నట్లు ఏఈ జమాల్‌వలి తెలిపారు. రాజోలి ప్రాజెక్టు నుంచి కేసీ ఆయకట్టుకు 392 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. అలాగే చాపాడు ఛానల్‌కు 72 క్యూసెక్కులు వదిలారు.

### అభివృద్ధిలో వార్డు మెంబర్లే కీలకం

నంద్యాల(అర్బన్): గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లే కీలకమని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు తదితర వాటిపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచ్ అయితే సభ్యులు అభివృద్ధిలో పాత్ర దారులని అన్నారు.

**ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి**

ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. డిజిటల్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో జరిగే ఆధార్ క్యాంపులు 22న కొత్తపల్లె-1, చాబోలు, పోలూరు, పాండురంగాపురం, 23న కొత్తపల్లె-2, చాబోలు, పాండురంగాపురం, పోలూరు, 24న అయ్యలూరు-1, కానాల-1, చాపిరేవుల, పోలూరు, 25న అయ్యలూరు-2, కానాల-1, చాపిరేవుల, పోలూరు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డి- 1, డి-2, డి-3 పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నంద్యాల విద్యుత్ కార్యాలయ డిప్యూటీ ఈఈ రమేష్‌కుమార్, ఏఈ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు సంబంధించిన పనులు చేసేందుకు సరఫరాను నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఎవరైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబరులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధ చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 125 అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ల వద్ద లింగ నిర్ధారణ నిషేధ చట్టం నిబంధనలుఅందరికీ కనపడేలా అర్థమయ్యే రీతిలో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా, డాక్టర్లు అతిక్రమిస్తే సంబంధిత డాక్టర్ల లైసెన్స్ రద్దు తదితర అంశాలను కూడా బోర్డులలో ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని సెంటర్లలో 15 రోజులలో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేసి ఆ వివరాలు తనకు సమర్పించాలన్నారు. జిల్లాలో 145 ప్రైవేట్ ఆస్పత్రులు, 82 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయని, ఇప్పటివరకు ఎన్ని అబార్షన్లు జరిగాయి, కారణాలు ఏంటి సంబంధిత వివరాలన్నీ తనకు సమర్పించాలని సూచించారు.

## గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ సైమాన్

గోస్పాడు: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అన్నారు. వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రారంభించారు. ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల పరిపాలన, వీధి దీపాలు, డ్రైనేజీలు, ఘన వ్యర్థాల నిర్వహణ పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగఅనసూయ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధిలోమీదే కీలకపాత్ర**

దొర్నిపాడు: గ్రామాభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులదే కీలకపాత్ర అని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు వారి హక్కులు, విధులు, బాధ్యతలు తప్పని సరిగా తెలుసుకోవాలని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సులోచన, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సుప్రియ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని చాగలమర్రి ఎంపీడీఓ మంజులవాణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఉప సర్పంచులు, వార్డుమెంబర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్, ఏఓ రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ బషీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం రెండు మూడు నిమిషాల్లోనే ఫొటోల చిత్రీకరణతో ముగిసింది. మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీల ఉప సర్పంచులు, ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు జీపీడీపీపై అవగాహన కల్పించేందుకు అధికారులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి మండలంలోని రెండు గ్రామాల నుంచి ఒక్కరో ఇద్దరో ఉప సర్పంచులు ,వార్డు మెంబర్ వచ్చారు.

## విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్యాపిలి: బాలికలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాలికలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలికల సంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. సరైన ప్రణాళికతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్ఐ మధుసూదన్ మాట్లాడుతూ.. పాఠశాలకు వచ్చివెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం బాలికల వసతిగృహాన్ని సందర్శించిన జడ్జి బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం సరళ, ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ మురళి, రీజనల్ డైరెక్టర్ సరస్వతి, ఎస్టీఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపులను తొలగించాలి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ప్రాంతంలో బస్ షెల్టర్, దేవాలయాలు, తొగర్చేడు మెట్ట వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపులను వేరే ప్రాంతానికి మార్చాలని నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుంకన్న, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు మాట్లాడుతూ నిత్యం విద్యార్థులు, మహిళలు తిరిగే ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయడం తగదన్నారు. తొగర్చేడు మెట్ట వద్ద దేవాలయాలు ఉన్నాయన్నారు.

– పట్టణంలోని వారాహీ వైన్స్, లిక్కర్ మార్ట్‌ను వేరే చోటుకు తరలించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, సహాయ కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

### నేడు విద్యుత్ కోత

ఉయ్యాలవాడ: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలని కోరారు.

### కొనసాగుతున్న పల్లెపండుగ వారోత్సవాలు

గోస్పాడు: పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం శుక్రవారం యాళ్లూరు, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు భూమిపూజ చేశారు. యాళ్లూరులో 1200 మీటర్లకు రూ.60 లక్షలు, ఎం.కృష్ణాపురంలో 400 మీటర్లకు రూ.20 లక్షల నిధులతో సీసీ రహదారులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్డీ నాగఅనసూయ తెలిపారు.

### నూతన గదులు వాడుకోవచ్చు

దొర్నిపాడు: రెవెన్యూ అధికారులు అవసరమైతే ఎంపీడీఓ కార్యాలయంలోని ఫస్ట్‌ఫ్లోర్‌లో నిర్మించిన నూతన గదులు వాడుకోవచ్చని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అధికారుల మధ్య కార్యాలయ ‘పోరు’ అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. ఎంపీడీఓ సావిత్రి, తహసీల్దార్ సుభద్ర మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా ఎవరి పనులు వారు సమన్వయంతో చేసుకుంటున్నారన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలును అపరిశుభ్రం చేస్తుండటంతో పాటు విద్యుత్ బిల్లు అదనంగా వస్తుండటంతో తాళాలు వేయించినట్లు చెప్పారు. అంతేగాని రెవెన్యూ ఉద్యోగుల పట్ల ఎంపీడీఓ సావిత్రికి ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. హాలు కాకుండా పైనా ఉన్న గదులను వినియోంచుకోమని తహసీల్దార్‌కు చెప్పినట్లు ఎంపీపీ చెప్పారు.

### అభివృద్ధి పనులకు భూమి పూజ

ఉయ్యాలవాడ: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. సుద్దమల్ల, సర్వాయిపల్లె గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామమద్దిలేటిరెడ్డి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, బాబులురెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### తూతూమంత్రంగా మండలమీట్

రుద్రవరం: మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా సాగింది. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఇందులో విద్య, వైద్య, గృహ నిర్మాణ, రెవెన్యూ తరదితర శాఖలకు చెందిన అధికారులు నివేదికలు చదివి చేతులు దులుపుకున్నారు. మండలంలో 3 పీహెచ్‌సీలు ఉండగా వాటిలో పనిచేసే ఏ ఒక్క వైద్యాధికారి సమావేశానికి రాలేదు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జున రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### క్విజ్ పోటీల్లో విజేతలు వీరే

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా కార్యాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీరత్ క్విజ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల వివరాలను జమాన్ ఫౌండేషన్ కన్వీనర్ నవభారత్ హుసేన్ శుక్రవారం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై సీరత్ క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో నంద్యాల భీమవరం రస్తాలోని అల్ ఫుర్‌ఖాన్ మదరసాకు చెందిన విద్యార్థి హుసేన్‌బాషా ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. రెండో స్థానంలో నేషనల్ స్కూల్ విద్యార్థి అస్లాం, మూడో స్థానంలో రోటరీ స్కూల్ విద్యార్థి నిఖిల్ నిలిచారన్నారు. విజేతలకు ఈనెల 24వ తేదీన నవభారత్ హైస్కూల్‌లో బహుమతులు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, ఖాజా, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లకీపై ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామికి శుక్రవారం రాత్రి పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయ శర్మ, నాగేశ్వరశర్మ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో కొలువుదీర్చారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు శాస్త్రోక్తంగా చేశారు.

## ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(అర్బన్): ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతుందని సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నాగరాజు అన్నారు. విద్యుత్ భారాన్ని తగ్గించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించి ఈఈ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు కాకమునుపే వినియోగదారులపై భారం మోపేందుకు యత్నిస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంపును వ్యతిరేకించిన బాబు ఇప్పుడు చేస్తున్నదేమిటో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్-6 పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆచరణలో పెట్టలేదన్నారు. లిక్కర్ మీద వేల కోట్లు దండుకునేందుకు ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ముజఫర్, తోటమద్దులు, గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈఅంశంపై శుక్రవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ ప్రసాద్, సుధాకర్, ప్రేమ్‌కాంత్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన హెచ్ఎంలకు ఎంఈఓలుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ సౌకర్యం, బదిలీలు చేపట్టాలని, లేని పక్షంలో ఈనెల 24వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, అరవిందుకుమార్, చంద్రశేఖర్, శేఖర్, బాలస్వామి, వెంకటేశ్వర్లు, శివశంకర్, జితేంద్ర, శ్రీనివాసరెడ్డి, రాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహమ్మద్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఈనెల 19,20 తేదీల్లో జరిగే ట్రాన్స్‌పోర్ట్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ కోరారు. శుక్రవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్ల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జూలై 1వ తేదీ నుండి ప్రవేశపెట్టిన భారత న్యాయ సంయుక్త చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, అధ్యక్షుడు రమేష్‌బాబు, లారీ మోటార్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్తంభించిన సేవలు



కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ల సముదాయం

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అతి ముఖ్యమైన మార్కెట్ విలువల నిర్ధారణ సర్వర్ వారం రోజులు షట్ డౌన్ అయింది. ఫలితంగా కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు స్తంభించిపోయాయి. దీంతో కార్యాలయాలకు వచ్చిన క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వినియోగదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు తిప్పు కుంటున్నారు. రిజిస్ట్రేషన్‌లు, మ్యూటేషన్ల ప్రక్రియలో మార్కెట్ విలువ అతి ముఖ్యం. ఒక పొలం, స్థలం, ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో మార్కెట్ విలువ ఆధారంగా ప్రభుత్వానికి చలానా రూపంలో నగదును విక్రయదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పొలాలు, ఇళ్ల మ్యూటేషన్ల ప్రక్రియలో పంచాయతీలు, మునిసిపాలిటీల్లో మార్కెట్ విలువ ఆధారంగా ప్రక్రియ కొనసాగిస్తారు. అయితే వారం రోజులుగా మార్కెట్ విలువలకు సంబంధించిన సర్వర్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా సేవలకు సంబంధించి కార్యాలయాలకు వచ్చిన విక్రయదారులు నిరీక్షించాల్సి వస్తోంది. అధికారులు దీనిపై కనీస సమాచారం ఇవ్వడంలేదని, అడిగితే తీవ్ర నిర్లక్ష్యంతో సమాధానం చెబుతున్నారని కొందరు వినియోగదారులు వాపోతున్నారు. వెంటనే సర్వర్ సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని క్రయ, విక్రయాదారులు కోరుతున్నారు.